సాక్షి
నిజామాబాద్
గురువారం । 27 । జూలై । 2023



ప్రాజెక్టుల ఘనత కాంగ్రెస్‌దే..

రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆ పార్టీ కిసాన్‌ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



ఫలించని ప్రయోగాలు

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు వద్ద గల చైనీస్ హెచరీల్లో చేప పిల్లల ఉత్పత్తి కోసం ఎన్ని సార్లు ప్రయత్నించినా విఫలమైంది.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.1 /23.9

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

టీ9 టికెట్‌తో రూ.50కే 30 కి.మీ ప్రయాణం

ఖలీల్‌వాడి: బస్సు ప్రయాణికుల కోసం కొత్తగా టీ9 టికెట్ ప్రవేశ పెట్టినట్లు ఆర్‌ఎం జానిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టికెట్‌తో రూ.50 చెల్లించి 30 కిలోమీటర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణించవచ్చునని తెలిపారు. ఈ టిక్కెట్లు పల్లెవెలుగు బస్సు కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రూ.20 కాంబితో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే సదుపాయం ఉందన్నారు.

'శాలసిద్ధి'పై అవగాహన



డిచ్‌పల్లి: శాలసిద్ధి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం డిచ్‌పల్లిలోని మానవతసదన్‌లో ఎంపిక చేసిన 31 పాఠశాలల ఉపాధ్యాయులకు శాలసిద్ధి కార్యక్రమంపై రెండు రోజుల అవగాహన సదస్సు ప్రారంభమైంది. డీఈవో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్‌లో పాఠశాలల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో 15 ఉన్నత పాఠశాలలు, 11 ప్రాథమిక పాఠశాలలను శాలసిద్ధి కోసం ఎంపిక చేశామన్నారు. జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పి శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్, ఎస్ వనిత, రిసోర్స్ పర్సన్స్ సంతోష్‌కుమార్, మధుసూదనచారి, సచ్చిదానంద్ పాల్గొన్నారు.

పెరిగిన పంటనష్టం అంచనా

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లావ్యాప్తంగా ఈ నెల 24, 25 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు పంటనష్టం అంచనా పెరిగింది. మంగళవారం నాటికి ఐదు వేలున్న పంటనష్టం బుధవారానికి 5,898 ఎకరాలకు చేరింది. ఇందులో 5,194 మంది రైతులున్నారు. ముప్కాల్, ఆర్మూర్, మోర్తాడ్, వేల్పూర్ మండలాల్లో పంటనష్టం ఎక్కువగా జరిగింది. 41 గ్రామాల్లో 3,031 ఎకరాల వరి, 35 గ్రామాల్లో 1,447 ఎకరాల సోయా, 19 గ్రామాల్లో 1,420 ఎకరాల మొక్కజొన్న దెబ్బతిన్నట్లుగా వ్యవసాయ శాఖ అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించింది.

స్తంభాలను తాకొద్దు

నిజామాబాద్‌నాగారం: వర్షాల నేపథ్యంలో రైతులు, వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తడి చేతులతో విద్యుత్ వైర్లు, పరికరాలు ముట్టుకోవద్దన్నారు. స్తంభాలను తాకొద్దని సూచించారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028, 1912కు ఫోన్ చేయాలన్నారు. సర్కిల్ ఆఫీస్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాలో వర్షాలు

మోర్తాడ్ : జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మోస్తరు వాన కురిసింది. మోర్తాడ్ మండలంలో వర్షం భారీగా కురిసింది. పొలాలు కొన్ని నీట మునిగి పోయాయి. బోధన్, డిచ్‌పల్లి, ఆర్మూర్‌లోని పలు మండలాల్లో వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లాలో మంగళవారం రాత్రి కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం పగలంతా కొంత తెరిపి ఇచ్చినా, రాత్రికి మళ్లీ వర్షం మొదలైంది. నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా, రాత్రి వరకు 13.825 టీఎంసీలకు చేరింది.

'మిషన్ వాత్సల్య'కు సహకరించాలి



ఖలీల్‌వాడి: మిషన్ వాత్సల్య పథకం కింద చైల్డ్ హెల్ప్‌లైన్ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పునః ప్రారంభించనున్నట్లు రైల్వే చైల్డ్ లైన్ ప్రతినిధి శ్రీనివాస్, రైల్వే ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బానోత్ బాబు తెలిపారు. బుధవారం నిజామాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ సదాశివుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1098 చైల్డ్ లైన్ కార్యక్రమం ఈ నెల 31న ముగుస్తుందన్నారు. శిశు సంక్షేమ అధికారి చైతన్య, మెడికల్ ఆఫీసర్ కవిత, బాలరక్ష కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఏఎస్సై సింహాచలం, ఉదయ్ కుమార్, జీఆర్పీ సిబ్బంది శ్రీకాంత్, సారిక పాల్గొన్నారు.

వరద గేట్లు భద్రమేనా!



ప్రాజెక్ట్ వరద గేట్లు

- 13 గేట్లకే మరమ్మతులు
- ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- వేగంగా పెరుగుతున్న నీటిమట్టం

బాల్కొండ: శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. వరద ఇలాగే కొనసాగితే మరి కొద్దిరోజుల్లో జలాశయం నిండే అవకాశం ఉంది. దీంతో మిగుల జలాలను గోదావరిలోకి వదలాడనికి నిర్మించిన ప్రాజెక్ట్ వరద గేట్లు భద్రమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరగుతోంది. దీంతో ఈ ఏడాది కూడా ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి మిగులు జలాలను వదిలే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం గేట్లు మొరాయించడంతో మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.17.5 కోట్లు మంజూరు చేసింది. రెండేళ్లుగా పనులు చేపడుతున్నా.. 42 గేట్లలో ఇప్పటి వరకు 13 గేట్లకు మాత్రమే మరమ్మతులు చేశారు. ఎగువ నుంచి లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరితే అంతేస్థాయిలో గోదావరిలోకి వదిలే అవకాశం ఉంటుంది. కానీ సగ గేట్లకు కూడా మరమ్మతులు పూర్తి కాలేదు. మిగతా గేట్లను కూడా ఎత్తొచ్చని అధికారులు చెబుతున్నారు. కానీ కాని గేట్లు ఎత్తినప్పుడు ఎదైన సమస్య తలెత్తితే ప్రాజెక్ట్‌కే ప్రమాదం ఏర్పాడే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేట్లకు సమస్య వచ్చినా స్టాప్‌లాగ్ గేట్ల సాయంతో నీరు పోకుండా అడ్డుకట్ట వేయొచ్చని అధికారులు భావిస్తున్నారు. గతంలో కూడా కొన్ని గేట్లను మాత్రమే ఎత్తి దిగువకు గరిష్ఠంగా ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్ట్ డ్యాం ఒత్తిడికి గురవుతుందని అప్పట్లో ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన ఉన్నత అధికారులు ప్రాజెక్ట్ అధికారులను హెచ్చరించారు. అయిన ప్రస్తుత సంవత్సరం కూడా అదే పరిస్థితి ఎదురయ్యేల ఉంది. కొన్ని మరమ్మతులు కొనసాగుతున్నాయి.

ఎలాంటి ఇబ్బంది లేదు

ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదలడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. వరద గేట్లు సిద్ధంగానే ఉన్నాయి. మరమ్మతులు చేపట్టే గేట్ల ద్వారా కూడా నీటి విడుదల చేపట్టవచ్చు. స్టాప్‌లాగ్ గేట్లు సిద్ధంగా ఉంచుకున్నాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

ఎస్సారెస్పీలోకి పోటెత్తిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద నీరు పోటెత్తింది. మంగళవారం రాత్రి 40 వేల క్యూసెక్కులు వచ్చిన ఇన్‌ఫ్లో బుధవారం ఉదయం వరకు లక్ష 16 వేల క్యూసెక్కులకు పెరిగింది. రోజంతా అదే స్థాయిలో వరద వచ్చింది. రాత్రి వరకు 59 వేల క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1086.6(73 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

జీజీహెచ్‌లో సేవలు భేష్



ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీ యంత్రం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీ సిస్టం, వాహనాలు ప్రారంభం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందిస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశంసించారు. పేదలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్న వైద్యులను, సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో రూ.90 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ సిస్టంను మంత్రి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మేయర్ నీతూకిరణ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రికి దాతలు సమకూర్చిన సౌకర్యాలను వైద్యులు సద్వినియోగం చేసుకుంటూ రోగులకు మెరుగైన సేవలందించాలని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు సూచించారు. డయాగ్నొస్టిక్ విభాగం అందిస్తున్న సేవలకు న్యాక్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించడంపై మంత్రి అభినందించారు.

అంబులెన్స్ ప్రారంభం

జోస్ అలుక్కాస్ జ్యూవెల్లరీ సంస్థ రోగుల సేవల కోసం ఆస్పత్రికి వితరణ చేసిన రూ.30లక్షల విలువ చేసే వ్యాన్‌ను, రాష్ట్ర ప్రభుత్వం రెడ్ క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌లకు వైద్య సేవలు అందించేందుకు సమకూర్చిన అంబులెన్స్‌ను మంత్రి ప్రారంభించారు. జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ ఆధ్వర్యంలో పీజీ సర్జన్ విద్యార్థులకు సిమ్యులేషన్ వర్క్ షాప్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుదర్శనం, డీసీఎంఎస్ చైర్మన్ మోహన్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు బుస్సా ఆంజనేయులు, తోట రాజశేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



నందిపేట్ (ఆర్మూర్): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో జయసుధ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆమె నందిపేటలోని పలు కాలనీలను సందర్శించి సీజనల్ వ్యాధులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్రం యమునా ముత్యం ఉప సర్పంచ్ కొత్తూరు భరత్, ఎంపీవో కిరణ్ కుమార్, గ్రామ కార్యదర్శి సౌమ్య పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: జిల్లా అంతటా భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం సంభవించకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాల నేపథ్యంలో కలెక్టర్ బుధవారం రాత్రి సెల్ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలు చేసినందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉంటూ పరిస్థితులను పరిశీలించి సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారితో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద బస్సులను జాగ్రత్తగా నడిపేలా ఆర్టీసీ డ్రైవర్లను అప్రమత్తం చేయాలని ఆర్‌ఎంకు సూచించారు. ఎగువ నుంచి భారీ వరద వస్తున్నందునా శ్రీరాంసాగర్‌లో నీటిమట్టం గణనీయంగా పెరుగుతోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని దిగువ పరివాహాక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సెల్ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ యాదిరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

నిజామాబాద్ సిటీ: పిల్లలతో పని చేయిస్తున్న యాజమాన్యాలను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ సమావేశం అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండేటట్టు చూడాలని, పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న, పని చేయిస్తున్న, వీధి బాలలను గుర్తించి వారిని బడిలో చేర్పించవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి షేక్ రసూల్ బి మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఇప్పటివరకు 52 మంది పిల్లలను గుర్తించామన్నారు. పిల్లలకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో సుదర్శనం, ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జి గోపినాథ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యోహాన్, బాల్ రక్షా భవన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, డీసీపీవో చైతన్యకుమార్, పోలీస్, కార్మిక శాఖ, డీసీపీయూ, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం బాధిత మహిళలు, పిల్లలకు అందిస్తున్నటువంటి పరిహారంపైన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బాధిత కుటుంబాలకు ధైర్యాన్ని కల్పించే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. బాధిత మహిళలకు, పిల్లలకు జాప్యం చేయకుండా పరిహారం చెల్లించాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 161 కేసులు నమోదు కాగా 63 మంది బాధితులకు మొదటి విడత, 98 కేసులను రెండో విడత పరిహారం ఇచ్చామన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు సఖి సెంటర్లో తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సురేందర్ రెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శనం, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ సంపూర్ణ, సఖి సెంటర్ కోఆర్డినేటర్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

భయం..భయంగా సర్కార్ చదువులు

ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటేనే విద్యార్థులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే చాలా పాఠశాలలు ఊరుస్తున్నాయి. బడుల ఆవరణలో నీరు నిలుస్తోంది.

- వివరాలు 8లో

SAKSHI GROUND REPORT సాక్షి గ్రౌండ్‌రిపోర్ట్



శిథిలావస్థలో ఉన్న ఆచన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల

సీజనల్ వ్యాధులపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, సీజనల్ వ్యాధులకు సంబంధించి ఏ సమస్య ఉన్న కంట్రోల్ రూమ్ నంబర్(9390653962)ను సంప్రదించాలని సూచించారు. అంటువ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

- నిందితుల కోసం జాగిలాలతో గాలింపు
- జంట హత్యలతో భయాందోళనలో ప్రజలు





హత్యకు గురైన సులోచన, నారాయణ(ఫైల్)

బాన్సువాడ : కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం రైతునగర్‌లో మంగళవారం రాత్రి జరిగిన జంట హత్యలు కలకలం రేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌కు చెందిన దారం నారాయణ గుప్తా (75), సులోచన (65) దంపతులు పదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం బీర్కూర్ మండలం రైతు నగర్ గ్రామానికి వచ్చారు. గ్రామంలో పెంకుటిల్లు కొనుగోలు చేసి ఇంట్లోనే నివాసముంటున్నారు. ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్‌లో కిరాణ దుకాణం పెట్టుకుని దంపతులిద్దరూ జీవిస్తున్నారు. ఉన్న కాస్తా డబ్బులను వడ్డీలకు ఇచ్చి కిరాణ దుకాణం నడుపుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి వెనుకాల నుంచి చొరబడి ఇంట్లో ఉన్న నారాయణను రాడ్‌తో కొట్టి చంపగా ఆయన భార్య సులోచనను చీరతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ప్రతి రోజు ఉదయమే లేచి కిరాణ దుకాణం తెరిచే దంపతులు తలుపులు తీయకపోవడంతో ఇంటి ముందున్న ఓ వ్యక్తి ఇంటి తలుపులు తీసి చూడగా నారాయణ ఓ గదిలో చనిపోయి ఉండగా వెనకాల ఉన్న గదిలో సులోచన మృతదేహం పడి ఉంది. దీంతో వెంటనే స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళీ వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను పిలిచి విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ మృతదేహాల వాసన చూసి గ్రామంలోని మిర్జాపూర్ రోడ్డులో ఉన్న రైతు వేదిక వరకు వెళ్లి మళ్లీ తిరిగి మృతుల ఇంటికి వచ్చింది. మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతులకు సంతానం లేకపోవడంతో బంధువులు వచ్చి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు.

వడ్డీకి డబ్బులు తీసుకున్న వారిపై ఆరా..

రైతునగర్ గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలతకు నారాయణ వడ్డీలకు డబ్బులు ఇచ్చే వాడు. అందులో ఎక్కువగా పేకాట ఆడే వారే ఉన్నట్లు తెలిసింది. ఈ మధ్య రైతునగర్ గ్రామ శివారులోని మంజీర ప్రాంతంలో పెద్ద ఎత్తున పేకాట స్థావరం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పేకాట ఆడే వారికి అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి వారం పది రోజుల్లో డబ్బులు చెల్లించేలా ప్రామిసరీ నోట్లు, రూ.10 స్టాంప్ పేపర్లపై రాసుకుని డబ్బులు ఇచ్చే వారని తెలిసింది. పోలీసులు ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం రోజున బ్యాంకులో కూడా రూ.30 వేలు డ్రా చేసినట్లు తెలిసింది. వడ్డీకి డబ్బులు ఇచ్చిన వారికి డబ్బుల కోసం ఒత్తిడి తేవడంతోనే వీరిని హత్య చేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు నారాయణ వద్ద వడ్డీకి డబ్బులు తీసుకున్న వారిని విచారిస్తున్నట్లు తెలిసింది.

భయంభయంగా సర్కారు చదువులు

- శిథిలావస్థలో పలు పాఠశాలల భవనాలు
- సరిపోని తరగతి గదులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

సర్కారు బడుల్లో విద్యార్థులు భయంభయంగా చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో భవనం పైకప్పులు ఎప్పుడు ఊడిపడతాయోనని, గోడలు కూలిపోతాయేమోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో ఇటీవల విజిట్ నిర్వహించగా పలు పాఠశాలల్లో అడుగడుగునా సమస్యలు కనిపించాయి.


గొట్టిముక్కుల పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

ఆర్మూర్/మాక్లూర్/బోధన్: ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నామంటున్న ప్రభుత్వం ప్రకటిస్తున్నా, సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మాక్లూర్ మండలం గొట్టిముక్కులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చినుకు పడితే చాలు విద్యార్థులకు సెలవు ప్రకటించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రాథమిక పాఠశాలలో 32 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు చదువుతుండగా 11మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలను ఎంపిక చేసి మరమ్మతులు చేపట్టినా, తరగతి గది సైతం చిన్నపాటి వర్షానికే ఊరుస్తుండటంతో విద్యార్థులు గదిలో కూర్చోలేకపోతున్నారు. పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు నిలిచి బురద గుంటలను తలపించేవిగా మారాయి. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం ఉన్నప్పటికీ నిర్వహణ లేని కారణంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. సమస్యలపై హెచ్‌ఎం సచితా నందను సంప్రదించగా ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

ఆర్మూర్ మండలంలో...


గోవింద్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాల దుస్థితి

ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలలో 63మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బోధన్ నియోజకవర్గంలో..

బోధన్ నియోజక వర్గం పరిధిలోని బోధన్ అర్బన్, రూరల్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎన్నో సమస్యలు నెలకొన్నాయి. కొన్ని చోట్ల అరకొర సౌకర్యాలతో విద్యబోధనను నెట్టికొస్తున్నారు. మన ఊరు –మనబడి కార్యక్రమం కింద బోధన్ ఉమ్మడి మండలంలో 34 పాఠశాలలను ఎంపిక చేయగా, ఇందులో ఆరు పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి.


శిథిలావస్థకు చేరిన మాక్లూర్ మండలంలోని గొట్టిముక్కుల ప్రభుత్వ పాఠశాల

ఒకే గదిలో ఐదు తరగతులు..


నర్సాపూర్ ప్రాథమిక పాఠశాల వరండా

బోధన్ ఒకటో వార్డులో గల నర్సాపూర్ ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. మూతపడిన ఈ పాఠశాలను 2016లో పునరుద్ధరించారు. పాఠశాలలో మూడు తరగతి గదులుండగా, ఇందులో రెండు గదులు శిథిలావస్థలో ఉండటంతో మిగిలిని ఒక గదిలో ఐదు తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. మొత్తం 41మంది విద్యార్థులుండగా 1నుంచి 5తరగతులకు ఒకే టీచర్ ఉన్నారు.

ఆచన్‌పల్లిలో..


ఆచన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు బోధన

ఆచన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనంలో మూడు తరగతి గదులుండగా, ఇందులో ఒక గది శిథిలావస్థలో ఉంది. మిగిలిన రెండు గదులు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయినా ఒక గదిలో 1నుంచి 5వ తరగతివరకు, మరో గదిలో 6, 7వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. బడిలో సరైన తాగునీటి సౌకర్యం లేదు. బాలురకు టాయిలెట్లు, ప్రహరీ లేదు. ఆరుగురు టీచర్లు ఉన్నారు. అలాగే గోశాల ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. ప్రస్తుతం అద్దె భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. 56 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. నూతన పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు టీచర్లు తెలిపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ బడుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఆర్మూర్‌లోని రాంమందిర్ పాఠశాలలో అధ్వానంగా మారిన మరుగుదొడ్లు


పెచ్చులూడుతున్న నర్సాపూర్ పాఠశాల పైకప్పు

గదుల్లో ఊరుస్తోంది..



వర్షాలు పడితే చదువుకోవడం కష్టంగా ఉంది. పాఠశాల భవనం పూర్తిగా శిథిలం కావడంతో పైకప్పులు ఎప్పుడు ఊడిపోతాయో అని భయపడుతున్నాం.వర్షపు నీరు తరగతి గదుల్లో ఊరుస్తోంది. ఇలా అయితే సర్కారు బడుల్లో చదువుకోవడం కష్టం.

– యోగేశ్వర్, పదో తరగతి, గోవింద్‌పేట్ హైస్కూల్

క్లుప్తంగా

దేశాభివృద్ధిలో సైన్స్‌అండ్ టెక్నాలజీ కీలకం



తెయూ(డిచ్‌పల్లి): భారతదేశాభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకప్రాత పోషిస్తుందని తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. తెయూలో బుధవారం 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఇందుకు యువ విద్యార్థి మేధావులు ముందుకు వచ్చి పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టు సైంటిస్ట్ డాక్టర్ రాధిక వంగాల మాట్లాడుతూ.. ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, పేటెంట్స్, కాపీరైట్స్ ఎలా సాధించాలో తెలిపారు. డాక్టర్ అపూర్వ, డాక్టర్ శాంతకుమారి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం మెంబర్‌గా రాజాగౌడ్



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన మరిపల్లి రాజాగౌడ్ ఉమ్మడి జిల్లా కన్స్యూమర్ ఫోరం(విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక) మెంబర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం ఆయన నిజామాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. 3సంవత్సరాలు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. ఎలక్ట్రిసిటి రెగ్యులేషన్ కమీషన్ ద్వారా నామినేట్ పదవిలో తనను నియమించినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఫోరం చైర్మన్ ఈశ్వరయ్య, టెక్నికల్ మెంబర్ ఖిషన్, ఫైనాన్స్ బెంబర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దే


ఎస్సారెస్పీ వద్ద నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్కొండ: తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దే అని పార్టీ కిసాన్‌ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా బుధవారం పార్టీ శ్రేణులు ప్రాజెక్ట్ వద్ద నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో భూములు బీడుగా మారకుండ సస్యశ్యామలం చేయుటకు, ఆనాటి కాంగ్రెస్ పెద్దలు తెలంగాణలో అనేక సాగునీటి ప్రాజెక్టులకు రూప కల్పన చేశారన్నారు. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్ట్ గొప్పలు చెబుతున్న బీఆర్‌ఎస్ నాయకులు జూన్‌లో ఆయకట్టుకు చుక్క నీరు ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. కేవలం రైతులను మోసం చేయడానికే కాళేశ్వరం డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కిసాన్‌ఖేత్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, భాగ్య పాల్గొన్నారు.


వృద్ధుల సంచార అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, జెడ్పీ చైర్మన్, మేయర్, కలెక్టర్ తదితరులు



'జోస్ అలుక్కాస్ బస్' కీని సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న మంత్రి

జీజీహెచ్‌కు బస్సు బహూకరణ అభినందనీయం

నిజామాబాద్ సిటీ: జోస్ అలుక్కాస్ జువెలరీ సంస్థ నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల సౌకర్యార్థం ఏసీ వాహనాన్ని అందజేయడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం జోస్ అలుక్కాస్ ఫౌండేషన్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఆస్పత్రికి ఏసీ బస్సును అందజేశారు. దీనిని మంత్రి ప్రారంభించి, మాట్లాడారు. ఈ బస్సు కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించడానికి, ఆపరేషన్ చేయించుకున్న వారిని ఆస్పత్రి నుంచి తమ స్వగ్రామాలకు చేర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బస్సు తాళం చెవిని సూపరింటెండెంట్‌కు అందజేశారు.ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, జెడ్పీచైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శనం, జోస్ అలుక్కాస్ ఏరియా మేనేజర్ లెనోజాన్, మేనేజర్ స్మిథీష్ తదితరులున్నారు.


జోస్ అలుక్కాస్ బస్సును ప్రారంభిస్తూ..



జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ఏర్పాటు చేసిన బస్సు.. బస్సులోపలి దృశ్యం


జాన్సన్ అండ్ జాన్సన్ బస్సును ప్రారంభిస్తూ..

క్రైం కార్నర్

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి


చిన్న రాజు(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ఊర చెరువులో ఓ వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బొల్లారం గ్రామానికి చెందిన దడ్డెర అలియాస్ ఇరగదిండ్ల చిన్నరాజు ఈ నెల 23న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం కుటుంబసభ్యులు చిన్నరాజు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం ఉదయం బొల్లారం ఊరచెరువులో చిన్న రాజు మృతదేహం తేలింది. చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లచ్చిరాం తెలిపారు.

నిజాంసాగర్ కెనాల్‌లో పడి యువకుడు..


షేక్ ఆసీఫ్ మృతదేహం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నిజాంసాగర్ కెనాల్‌లో పడి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కొత్తపేట్‌కు చెందిన షేక్ ఆసీఫ్(23) మంగళవారం ప్రమాదవశాత్తు నిజాంసాగర్ కెనాల్‌లో పడిపోయాడు. స్థానికులు అతని కోసం తీవ్రంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో వెతికించగా అర్ధరాత్రి మృతదేహం లభ్యం అయ్యింది. మృతదేహాన్ని పోలీసులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న షేక్ ఆరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఎక్సైజ్ కానిస్టేబుల్..


గణపతి (ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ వద్ద గల అంతర్ రాష్ట్ర ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ గణపతి (58) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. జుక్కల్ మండలంలోని కంఠాలి గ్రామానికి చెందిన గణపతి సుమారు రెండేళ్లుగా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం పది గంటలకు డ్యూటీ ముగించుకోని గణపతి ఇంటి వెళ్లాడని రాత్రి ఇంట్లో హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎల్లారెడ్డిపల్లి హెచ్‌ఎంపై చర్యలు

నిజామాబాద్‌అర్బన్: ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం భూమయ్యపై డీఈవో దుర్గాప్రసాద్ ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులకు వేతనాలు మంజూరు చేశారని విచారణలో తేలడంతో అతడికి చార్జిమెమో జారి చేశారు. అలాగే ఇన్‌చార్జి హెచ్‌ఎం బాధ్యతల నుంచి తప్పిస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

సెలవు దినాలకు వేతనాలు మంజూరు చేయడంతో..

ఎల్లారెడ్డిపల్లి పాఠశాలలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 8 మంది ఉపాధ్యాయులు వివిధ సందర్భాలలో సెలవులను వినియోగించుకున్నారు. ఈ సెలవులకు సంబంధించి సెటిల్మెంట్ కాకుండా, నిబంధనలు పాటించకుండా సంబంధిత ప్రధానోపాధ్యాయుడు వారికి వేతనాలను మంజూరు చేశారు. దీనిపై ఫిర్యాదు అందడంతో జిల్లా విద్యాశాఖ అధికారి విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో ఎంఈఓ ప్రొసీడింగ్ లేకుండానే వేతనాలు మంజూరైనట్లు గుర్తించారు. విచారణ అధికారి రాజ్‌గంగారెడ్డి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించారు. ఈ నివేదిక ప్రకారం అతడిపై చర్యలు తీసుకున్నారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి రెండురోజుల జైలు

దోమకొండ: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో మండల కేంద్రానికి చెందిన నాగుల రామ్మూర్తి అనే వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష పడినట్లు ఎస్ఐ సుధాకర్ బుధవారం తెలిపారు. ఇటీవల రామ్మూర్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. అతడిని కోర్టులో హాజరపర్చగా, కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్ష విధించారని వివరించారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలి



ఖలీల్‌వాడి: కేజీబీవీ నాన్ టీచింగ్ – వర్కర్లను క్రమబద్ధీకరించాలని, తక్షణమే కనీస వేతనాలను అమలు చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ – వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో సిబ్బందికి కనీస వేతనాలు అమలు కాక, శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.60 కూడా వీరికి అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కేజీబీవ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని మంత్రి, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర నాయకులు హేమలత, కేజీబీవీ సిబ్బంది సంధ్య, సుమలత, సుకన్య, శారద, ప్రేమ, చంద్రకళ, ఉమ, మాధవి పాల్గొన్నారు.

ముగ్గురు సీఐల బదిలీ

ఖలీల్‌వాడి: మల్టీ జోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలో నిజామాబాద్ సీసీఎస్‌లో ఉన్న సీఐ డాబాటా మోహన్ నిర్మల్ జిల్లా ఖానాపూర్ సీఐగా బదిలీ అయ్యారు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న సీఐ రవీందర్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఎస్బీలో సీఐగా పదోన్నతి పొందిన ఎస్ఎస్ ప్రసాద్ డీటీసీ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు.

వర్షాలకు కూలిన ఇళ్లు


రాణాకలాన్‌లో కూలిన ఇల్లు

ఎడపల్లి(బోధన్): మండలంలోని రాణాకలాన్ గ్రామంలో గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మూడు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన మెట్టు కృష్ణ, తలారి గంగవ్వ, భూమయ్యలకు చెందిన ఇళ్లు కూలిపోవడంతో మూడు కుటుంబాలు నిరాశ్రయులుగా మారాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గోడ కూలి ఇరువురికి గాయాలు


బోర్లంలో కూలిన గోడ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామం మున్నూరుకాపు కాలనీలో పాత ఇంటిగోడ కూలిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇంటిముందు గల కొట్టంలో బుధవారం మంద లచ్చవ్వ, మంద నారాయణ దంపతులు వంట చేస్తుండగా పక్కన ఉన్న వడ్ల లక్ష్మణ్‌కు చెందిన ఇంటి గోడ కొట్టంపై కూలింది. వెంటనే స్థానికులు గాయపడ్డ ఇరువురిని శిథిలాల్లోంచి తీసి బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలిచారు. మంద లచ్చవ్వ కాళ్లు విరిగాయని, నారాయణకు గాయాలైనట్లు సర్పంచ్ సరళ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఘటన స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, ఉపసర్పంచ్ మంద శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు సందర్శించారు.

బీబీపేట: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన నర్సగోని మల్లాగౌడ్‌కు చెందిన ఇళ్లు కూలింది. దీంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

- రూ. 1.66 లక్షల నగదు, 20 తులాల వెండి స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: మండలంలోని తాడ్కోల్‌లో గతంలో జరిగిన చోరీ కేసులో ఒకరిని అరెస్ట్ చేసి, రూ.1.66 లక్షల నగదు, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. గత నెల 27న మండలంలోని తాడ్కోల్‌లో టీకారం జైస్వాల్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరుగగా, దుండగులు రూ.2.20 లక్షల నగదుతో పాటు కిలో వెండి అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని అన్నారు. బుధవారం తాడ్కోల్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో తాడ్కోల్ గ్రామానికి చెందిన బాన్సువాడ సాయిలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు, సీసీఎస్ సిబ్బంది పట్టుకుని విచారించారన్నారు. జైస్వాల్ ఇంట్లో తనే దొంగతనం చేశానని ఒప్పుకున్నాడని ఎస్పీ అన్నారు. సాయిలు ఇంట్లో ఉన్న రూ.1.66 లక్షల నగదుతో పాటు 20 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించనున్నట్లు ఆయన అన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ మహేందర్ రెడ్డి, సీసీఎస్ సీఐ మల్లేశ్‌గౌడ్, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.